భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 25.0

బాలికలదే పైచేయి

- ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రంలోనే తొమ్మిదో స్థానంలో పశ్చిమ గోదావరి
- గత ఏడాదికంటే పెరిగిన ఉత్తీర్ణత
- సెకండియర్ 80 శాతం, ఫస్టియర్ 69 శాతంతో పాస్

భీమవరం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 : ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో జిల్లా విద్యార్థులు మెరుగైన ఉత్తీర్ణతను సాధించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఇంటర్ సిలబస్‌ను వేగంగా ముగించి, పరీక్షలను కొన్ని వారాల ముందుగానే నిర్వహించినప్పటికీ గతేడాదికంటే ఉత్తీర్ణత శాతం పెరిగింది. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో బాలురకంటే బాలికలే మెరుగైన ఫలితాలు సాధించారు. గత ఏడాది 13 ఉమ్మడి జిల్లాలకు గాను తొమ్మిదో స్థానంలో నిలవగా, ఈ ఏడాది 26 కొత్త జిల్లాలకు గాను తొమ్మిదో స్థానం సాధించింది. ఈ ఏడాది మార్చి ఒకటి నుంచి 18వ తేదీ వరకు ఇంటర్ పరీక్షలు జరిగాయి. జిల్లావ్యాప్తంగా జనరల్ ఫస్టియర్ విద్యార్థులు 15,645 మంది పరీక్షలకు రాయగా 10,843 మంది (69 శాతం) ఉత్తీర్ణత సాధించారు. సెకండియర్‌లో 13,161 మందికి గాను 10,470 మంది (80 శాతం) ఉత్తీర్ణులయ్యారు. జనరల్ కేటగిరిలో ప్రైవేటు విద్యా సంస్థల విద్యార్థులు ఫస్టియర్ 13,729 మందికి గాను 9,930 మంది, ద్వితీయ సంవత్సరం 11,672కి 9,479 విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. జనరల్ కేటగిరిలో ఫస్టియర్ 7,194 మంది బాలురకు గాను 4,598 మంది, 8,451 మంది బాలికలకు గాను 6,245 మంది ఉత్తీర్ణత సాధించారు. రెండో సంవత్సరం 5,830 మంది బాలురకు గాను 4,366 మంది, 7,331 మంది బాలికలకు గాను 6,104 మంది ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ కేటగిరిలో మొదటి సంవత్సరం 570 మంది బాలురకు గాను 284 మంది, 994 మంది బాలికలకు గాను 692 మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం 410 మంది బాలురకు గాను 246 మంది, 813 మంది బాలికలకు గాను 628 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ కళాశాలల్లో ఫస్టియర్ విద్యార్థులు 866 మంది గాను 351 మంది, ద్వితీయ సంవత్సరంలో 694కి 460 మంది విద్యార్థులు ఉతీర్ణత సాధించారు. ఆదర్శ విద్యార్థులు ప్రథమ సంవత్సరం 1070 మందికి గాను 562 మంది, ద్వితీయ సంవత్సరం 839 మందికి గాను 531 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్‌లో జిల్లాలో ప్రథమ సంవత్సరంలో 1,575 మందికి గాను 981 మంది (62 శాతం) ఉత్తీర్ణతగా నిలిచారు. ద్వితీయ సంవత్సరంలో 1,229 విద్యార్థులకు 877 (71 శాతం) మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ ప్రైవేటు విద్యా సంస్థలలో ప్రథమ సంవత్సరం 929 మందికి 522 మంది, ద్వితీయ సంవత్సరంలో 771 మందికి గాను 559 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ కళాశాలలో ప్రథమ సంవత్సరం 301 మందికి గాను 157 మంది ద్వితీయ సంవత్సరంలో 231 మందికి 146 మంది ఉత్తీర్ణత సాధించారు.



మే 25న సప్లిమెంటరీ ఫలితాలు

ఇంటర్మీడియట్‌లో ఫెయిల్ అయిన వారితోపాటు ఫలితాలను మెరుగుపరుచుకునే వారి కోసం మే 25వ తేదీ నుంచి జూన్ 1 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్స్‌లో ఫెయిల్ అయిన వారికి జిల్లా కేంద్రంలోని ఒక పరీక్ష కేంద్రంలో మే 1 నుంచి నాలుగో తేదీ వరకు నిర్వహిస్తారు. పరీక్ష ఫలితాల రీ వెరిఫికేషన్ ఒక్కో పేపరుకు రూ.1,300, రీ కౌంటింగ్‌కి (ప్రతీ పేపర్‌కి రూ.260) చెల్లించాలి. వీటికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఏప్రిల్ 18 నుంచి 24వ తేదీలోపు రుసుం చెల్లించాలి.

ఈవీఎంలు, వీవీ ప్యాట్స్ ర్యాండమైజేషన్ పూర్తి

భీమవరం టౌన్, ఏప్రిల్ 12 : వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో పకడ్బందీగా ఈవీఎంలు, వీవీ ప్యాట్స్‌ల మొదటి ర్యాండమైజేషన్ విజయవంతమైందని జిల్లా కలెక్టరు, ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక ఈవీఎంల గోడౌను వద్ద ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ సూచనల మేరకు శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈవీఎం, వీవీ ప్యాట్స్ యంత్రాలు తరలించే వాహనాలకు జీపీఎస్ ట్రాకింగు ఉంటుందని, సెక్యూరిటీ ప్రోటోకాల్ ప్రకారం పటిష్టమైన పోలీసు బందోబస్తుతో అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలకు పంపిస్తామన్నారు.

కొత్త ఓటుకు రెండు రోజులే గడువు

భీమవరం టౌన్, ఏప్రిల్ 12 : ఈ నెల ఒకటో తేదీ నాటికి 18 ఏళ్లు నిండితే వచ్చే నెలలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ఓటు వేసేందుకు అర్హత సాధించినట్లే. వీరంతా ఓటు హక్కు కల్పించమంటూ దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకు రెండు రోజులు మాత్రమే వుంది. ఈ నెల 14లోగా వచ్చిన దరఖాస్తులను అధికారులు పరిశీలించి అర్హులకు ఓటు హక్కు కల్పిస్తారు. కావున ఆన్‌లైన్, ఎన్నికల సంఘం వెబ్‌సైట్, బీఎల్‌వోల ద్వారా దరఖాస్తు చేయాలని అధికారులు కోరుతున్నారు. 2 రోజుల తర్వాత వచ్చిన దరఖాస్తులను ఇప్పుడు పరిశీలించరు. కొత్త ఓటుకు, చిరునామా మార్పులకు దరఖాస్తు చేసుకోవాలి.

ఎన్నికల విధులా..? మా కొద్దు బాబోయ్!



మినహాయింపు కోరుతూ వినతుల వెల్లువ

- మరోవైపు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు గడువు సమీపిస్తున్నా ఓపీఓల నియామకాలే లేవట!
- ఇక తీవ్ర అనారోగ్యం, అంగ వైకల్యాలకు మినహాయింపులపైనా ఆరోపణలు
- వైద్య ధ్రువీకరణలపై స్క్రూటినీకి మెడికల్ బోర్డు!



ఏలూరు ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 : సాధారణ ఎన్నికల నిర్వహణకు సిబ్బంది నియామకాలకు సంబంధించి పలు అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. మరోవైపు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు గడువు సమీపిస్తున్నా ఓపీఓలకు ఇంత వరకు ఎన్నికల విధుల నియామక పత్రాలు జారీ చేయక పోవడం వంటి సమస్యలు తెరమీదకు వచ్చాయి. ఆ వివరాలను యూటీఎఫ్ జిల్లా నాయకుడు పీ.వీ. నరసింహారావు ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులకు సంబంధించి జిల్లాలో ఇప్పటి వరకు పీవో/ఏపీవోల నియామకాలు, నియామక ఉత్తర్వుల జారీ జరిగిందని, వీరందరికీ పోలింగ్ నిర్వహణపై ప్రస్తుతం శిక్షణ ఇస్తున్నారన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికల డ్యూటీలు పడిన ఉద్యోగులందరూ పోస్టల్ బ్యాలెట్ వెసులుబాటును వినియోగించుకునేందుకు ఈ నెల 14వ తేదీ చివరి గడువు తేదీగా ప్రకటించారని, ఆ మేరకు పోలింగ్ విధుల్లో పాల్గొనే మిగతా సిబ్బంది ఓపీఓ (అదర్ పోలింగ్ ఆఫీసర్/పోలింగ్ క్లర్క్) విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఇంత వరకు నియామక పత్రాలను జిల్లాలో జారీ చేయనందున ఓపీఓలు పోస్టల్ బ్యాలెట్ సదుపాయాన్ని వినియోగించుకునేందుకు సాంకేతిక సమస్యలు తలెత్తే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఒక్కో పోలింగ్ బూత్‌లో ఎన్నికల విధులు నిర్వర్తించే పీవో/ఏపీవోలతోపాటు కనీసం ఇద్దరు నుంచి ముగ్గురు ఉద్యోగుల వరకు క్లర్క్ (ఓపీఓ)లుగా వ్యవహరిస్తారని, వీరు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసే గడువు తేదీ సమీపిస్తోందన్న విషయాన్ని జిల్లా ఎన్నికల అధికారులు గమనించాలని కోరారు. ఓపీఓలుగా గుర్తించిన ఉద్యోగులకు తక్షణమే నియామక పత్రాలు జారీ చేయడం లేదా పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకునే గడువు తేదీని పొడిగించడం గాని చేయాలని డిమాండ్ చేశారు.

ఏలూరు కలెక్టర్‌ను కలిసిన ఉపాధ్యాయ సంఘాల జేఏసీ నాయకులు

ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం శారీరక అంగవైకల్యం వున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపులు ఇవ్వాల్సి వున్నా జిల్లాలో ఈసీ సూచనలకు విరుద్ధంగా పలువురికి పీవో/ఏపీవో నియామక పత్రాలు జారీ అయ్యాయని నరసింహారావు ఆరోపించారు. కొన్ని పాఠశాలల్లో మోకాళ్ల కు శస్త్ర చికిత్సలు, 80 నుంచి 89 శాతం అంగ వైకల్యం వున్న టీచర్లను పీవో/ఏపీవోలుగా నియమించారని, మరికొన్నిచోట్ల 70 శాతం అంగవైకల్యం వున్నవారికి మినహాయింపులు ఇచ్చారని ఆరోపించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌ను ఉపాధ్యాయ సంఘాల జేఏసీ సభ్య సంఘాల నాయ కులు కలుసుకుని ఎన్నికల విధుల నుంచి మినహాయింపులపై చర్చించినట్టు వివరించారు. ఆ ప్రకారం మంచంపై ఉన్న, వీల్ చైర్‌పై వున్న వారికి మాత్రమే మినహాయిం పులు ఇచ్చినట్టు ఆయన చెప్పారని తెలిపారు. వీటితోపాటు బైపాస్ శస్త్రచికిత్స జరిగి కదలలేనిస్థితిలో వున్నవారికి, శారీరక అంగవైకల్యం వున్నవారు, తీవ్ర అనారోగ్యంతో వున్నవారు వైద్యుడు ధ్రువీకరించిన పత్రాలతో ఓ జాబితాను శనివారం సాయంత్రంలోగా కలెక్టర్ ఆదేశాల మేరకు డీఆర్వోకు అందజేస్తామని, వాటిని పరిశీలించాలని జేఏసీ నాయకులు అభ్యర్థించారన్నారు.



మీ ఆవేదన అర్థం చేసుకున్నా


సహకరించండి

ఎమ్మెల్యే మంతెన, పార్టీ శ్రేణులతో చంద్రబాబు

ఉండిపై ఒకటి, రెండు రోజుల్లో నిర్ణయం

- నా బాధను మీతో పంచుకునేందుకే సమావేశం
- జగన్ అరాచకాలతో అంతా ఇబ్బంది పడ్డాం
- అతని దుర్మార్గ పాలన అంతానికే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా కలిశాం
- నరసాపురం ఎంపీ స్థానం బీజేపీకి వెళ్లడం వల్లే ఇబ్బందులు వచ్చాయి
- కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునేటప్పుడు కొందరికి ఇబ్బందులు తప్పవు
- రామరాజుకు న్యాయం చేయడం నా బాధ్యత
- అమలాపురంలో కార్యకర్తలను సముదాయించిన టీడీపీ అధినేత

అమలాపురం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): 'నా మనసులో చాలా బాధ ఉంది.. మీతో పంచుకోవాలనే ఇక్కడకు పిలిపించాను. రామరాజు టిక్కెట్ వ్యవహారం నాకు వదిలేయండి. నేను పార్టీ, రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సముచిత నిర్ణయం తీసుకుంటా. సమర్థత కలిగిన నాయకుల్లో రామరాజు ఒకరు. అటువంటి వ్యక్తిని నేను దూరం చేసుకోలేను' అని పశ్చిమ గోదావరి జిల్లా ఉండి అసెంబ్లీ నియోజకవర్గ కార్యకర్తలను ఉద్దేశించి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఉండి టిక్కెట్‌ను ఎంపీ రఘురామకృష్ణంరాజుకు కేటాయించనున్నారన్న నేపథ్యంలో సిట్టింగ్ ఎమ్మెల్యే రామరాజు వర్గీయులు తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేస్తూ ఇప్పటికే రాజీనామాలు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే రామరాజుతోపాటు ఆ నియోజకవర్గంలోని టీడీపీ కీలక నేతలతో శుక్రవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం కిమ్స్ వైద్య కళాశాలలోని కాన్ఫరెన్సు హాలులో చంద్రబాబు భేటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. 'జగన్ దుర్మార్గ పాలనను అంతమొందించేందుకు రాష్ట్రంలో జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్నాం. పొత్తుల వల్ల కొంచెం ఇబ్బందులు వచ్చాయి. అయినా తగ్గాం. జనసేన కూడా సీట్లు కోల్పోయింది. రాష్ట్ర భవిష్యత్తును ఊహించుకుని బీజేపీతో పొత్తు పెట్టుకోవాల్సి వచ్చింద'ని స్పష్టం చేశారు. ఈ కారణంగా మా అంచనాలన్నీ తలకిందులయ్యాయి. ఉమ్మడి గోదావరి జిల్లాలు టీడీపీకి కంచుకోట. రామరాజుపై ఎటువంటి వ్యతిరేకతా లేదు. వివక్షా లేదు. నర్సాపురం ఎంపీ స్థానం బీజేపీకి వెళ్లడం వల్ల ఇబ్బందులు తలెత్తాయి. అదే ఎంపీ రఘురామకృష్ణరాజుకు ఇస్తే రామరాజు, రఘురామకృష్ణంరాజు ఈక్వేషన్ చాలా బాగుండేది. నియోజకవర్గంలో నెలకొన్న పరిస్థితులపై ముఖ్య నాయకులతో నా మనసులో ఉన్న భావాలను మీ ముందుంచి సర్దిచెప్పే ఉద్దేశంతో ఇక్కడకు పిలిపించాను. రామరాజుకు న్యాయం చేయడం, సరైన పరిష్కారం చూపడం ద్వారా రాష్ట్రానికి ఓ మెసేజ్ ఇవ్వాలనేది నా లక్ష్యం. రఘురామకృష్ణరాజు జగన్ బాధితుడు. ఆ రోజు అరెస్టు చేసి ఇబ్బందులకు గురిచేస్తే టీడీపీ ఆదుకుంది. ఆయన్నే కాదు జగన్ అరాచకాలతో ఇబ్బందిపడ్డ అందిరినీ మేం ఆదుకున్నాం. చివరిలో నేను జైలుకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి అంటూ చంద్రబాబు కొన్ని కీలక అంశాలను పార్టీ నేతలకు విశదీకరించారు. పరిస్థితులను అర్థం చేసుకోగలను. నమ్ముకున్న నాయకుడికి, కార్యకర్తలకు ఇబ్బంది కలగకుండా నిర్ణయం తీసుకోవడం నా బాధ్యత అంటూనే అవసరమైనప్పుడు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకునేటప్పుడు కొందరికి ఇబ్బంది కలగవచ్చంటూ పరోక్ష సంకేతాలు ఇచ్చారు. రామరాజు పార్టీ అప్పగించిన ఏ కార్యక్రమాన్నైనా ఎంతో సమర్థతతో విజయవంతం చేశారు. మహానాడు నుంచి అసెంబ్లీలో జరిగిన అనేక కార్యక్రమాల అమలుకు చేసిన కృషిని ఈ సందర్భంగా ప్రశంసించారు. బీజేపీ ముఖ్యులతో తాను, జనసేన అధినేత పవన్‌కల్యాణ్, బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి భేటీ ఉంది. రాష్ట్రవ్యాప్తంగా కొన్ని సీట్లకు సంబంధించి ఒకట్రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని చంద్రబాబునాయుడు ఉండి నియోజకవర్గ నేతలకు వివరించారు. నియోజకవర్గంలోని పార్టీ ముఖ్య నేతలు తమ ఆవేదనను చంద్రబాబు ముందుంచారు. మీ ఆవేదనను నేను అర్థం చేసుకున్నా.. నాకు సహకరించండి అంటూ సమావేశాన్ని ముగించి చంద్రబాబు బయటకు వెళ్లిపోయారు. ఉండి టిక్కెట్టు విషయం ఎటూ తేలకపోవడంతో అక్కడికి వచ్చిన కార్యకర్తలు నిరుత్సాహం చెందారు.



బాబు నిర్ణయంపైనే నా నిర్ణయం
ఉండి ఎమ్మెల్యే రామరాజు

'ఉండి నియోజకవర్గంలో మూడు రోజులుగా నెలకొన్న పరిస్థితులను చంద్రబాబు దృష్టికి తీసుకుని వెళ్లాం. ఆయన కూడా నా పట్ల విశ్వాసంతోనే ఉన్నారు. మంచి నాయకుడిగా గుర్తించారు. అయితే నియోజకవర్గ టిక్కెట్టు విషయంలో ఆయన తీసుకునే నిర్ణయంపై నా భవిష్యత్తు నిర్ణయం ఆధారపడి ఉంటుంది. ఇప్పటికే నేను నియోజకవర్గంలో 1,560 కిలోమీటర్ల మేర పర్యటించి 2 లక్షల మంది ఓటర్లను కలిసి మద్దతు కోరారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా సీటు ఇస్తున్నట్టు తొలుత ప్రకటించి ఇప్పుడు మార్పు చేస్తాననడం నన్ను ఆవేదనకు, ఆందోళనకు గురిచేసింది' అని రామరాజు మీడియాకు వెల్లడించారు.

బాబుతో మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు భేటీ



భీమవరం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి):తెలుగుదేశం అధినేత చంద్రబాబుతో నరసాపురం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు శుక్రవారం అమలాపురంలో భేటీ అయ్యారు. నియోజకవర్గ రాజకీయ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా వున్న కొన్ని సమస్యలను చంద్రబాబు దృష్టికి మాధవనాయుడు తీసుకు వెళ్లారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో తాము చేసిన పోరాటాలు, ఈ సమయంలో తనపైన, కేడర్‌పైన పెట్టిన కేసులు, ఈ కారణంగా జరిగిన నష్టాన్ని ఆయన వివరించారు. ఇవన్నీ తనకు తెలుసునని, పొత్తులో భాగంగా నరసాపురం స్థానాన్ని జనసేనకు కేటాయించాల్సి వచ్చిందని చంద్రబాబు చెప్పారు. కూటమి అభ్యర్థి నాయకర్‌ను గెలిపించాలని కోరారు. మాధవ్ వెంట మాజీ జడ్పీటీసీ కుక్కల మీరయ్య ఉన్నారు.

వైసీపీ ఓట్ల వల!

డ్వాక్రాపై ముప్పేట దాడి

- మహిళా సంఘాలపై అధికార వైసీపీ ఎత్తుగడలు
- ఓటింగ్ సమయానికి తమ వైపు చేరేలా వ్యూహం
- ఆర్పీలు, వలంటీర్లదే కీలకపాత్ర

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళా సంఘాల రూపురేఖలే మారిపోయాయి. ఒకప్పటి ఆదరణ, అభిమానం కోల్పోయి బెదిరింపులు మొదలయ్యాయి. అధికార పార్టీ ఏ సభ నిర్వహించినా డ్వాక్రా మహిళలు హాజరు కావాల్సిందే. ఓ వైపు వలంటీర్లు, మరోవైపు రీసోర్స్ పర్సన్లు అర్థంతరంగా వాలిపోవడం ఆరంభమైంది. చేసేది లేక మహిళలంతా హాజరు వేయించుకుంటే పోలా ఎందుకు ఈ తిప్పలనే స్థాయికి చేరారు. మంత్రి, ఎమ్మెల్యే, స్థానిక నేత ఎవరైనా సరే ఎవరు సభలు పెట్టినా కనిపించేది డ్వాక్రా మహిళలే. ఏలూరు జిల్లాలో 20,768 పొదుపు సంఘాలకు 2,07,680 మంది, పశ్చిమ గోదావరిలో 18,370 పొదుపు సంఘాలకు 1,83,700 మంది సభ్యులుగా ఉన్నారు. వీరందర్ని ఐదేళ్లుగా కీలు బొమ్మలుగా మార్చేశారు. ప్రత్యేకించి ఒక దశలో మహిళా సంఘాలు వాటిలో సభ్యులు ఆయా కుటుంబాల స్థితిగతులు ఆర్థిక పరమైన వనరులు, వీటన్నింటిపైన వలంటీర్ల దగ్గర నుంచి రీసోర్స్ పర్సన్ల వరకు జల్లెడ పట్టేశారు. ప్రత్యేకించి అన్ని సంఘాల్లోనూ అధికార వైసీపీ అనుకూలురుదే పైచేయి అయింది. చాలా సంఘాల్లో వీరు చెప్పిందే ఆట, పాడిందే పాట. ఈ దశలో సంఘాల్లో ఉన్న సభ్యులను రాజకీయపరంగా ఏమార్చడానికి ప్రయత్నించారు. ఉదాహరణకు మునిసిపాలిటీలు, కార్పొరేషన్ ఎన్నికల్లో మెప్మాలో సభ్యులుగా ఉన్న మహిళలు అందరిని వైసీపీకి ఓటు వేయాల్సిందిగా అప్పట్లో ప్రేరేపించింది వీళ్ళే. రాబోయే రోజుల్లో మరిన్ని పథకాలు రాబోతున్నాయని అవి కూడా మీ పేరు మీదే ఉంటాయని, కాదు, కూడదని మా మాట జవదాటితే అవన్ని ఫట్ అంటూ మరీ బెదిరించారు. దీనికితోడు సీఎం జగన్ అనేక పథకాల ఆరంభానికి బటన్ నొక్కేందుకు జిల్లాలకు వచ్చినప్పుడు మహిళల్నే టార్గెట్‌గా ఎంచుకుని వేలాది మందిని ఆర్టీసీ బస్సులు, వాహనాల్లోకి తరలించడం చేశారు. ఎవరైనా సమావేశానికి రామని, డుమ్మా కొట్టేందుకు ప్రయత్నిస్తే బహిరంగంగానే బెదిరించారు. సంఘంలో సభ్యులుగా ఉండరని, ప్రభుత్వ పథకాలు నసేమిరా మీకు అందవంటూ వలంటీర్ల చేత సమాంతరంగా ఈ పొదుపు సంఘాలకు కీలక బాధ్యతల్లో ఉన్న రీసోర్స్ పర్సన్‌లను ప్రయోగించారు. ఈ ఐదేళ్ళ డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళలు పడినపాట్లు అన్ని ఇన్నీ కానేకావు.

ఓవైపు ఆర్పీలు, ఇంకోవైపు వలంటీర్లు

పొదుపు సంఘాల మహిళలతో చెలగాటం ఆడిన వారిలో రీసోర్స్‌పర్సన్‌లు వలంటీర్లు ఉన్నారు. ప్రత్యేకించి డ్వాక్రా సంఘాలంటే అవి తమ చేతిలోనే ఉన్నట్లు. తాము ఏం చెబితే అదే జరుగుతుందనే భ్రమ కల్పించే ప్రయత్నం చేశారు. దీనిలో భాగంగానే సీఎం జగన్మోహన్‌రెడ్డి ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలకు పలుమార్లు వచ్చారు. ఆయన వచ్చిన ప్రతిసారి మండుటెండ అయినా, వానైనా సంఘాల మహిళలంతా తప్పనిసరిగా హాజరు కావాల్సిందే. ప్రత్యేకించి రీసోర్స్‌పర్సన్, వలంటీర్ దగ్గరుండి మరి ప్రతి గ్రూపులో నుంచి మహిళలు బస్సులు ఎక్కేలా హాజరు వేయించుకున్నారు. సమావేశానికి వెళ్ళి తిరిగి వచ్చేంతవరకు అనుక్షణం నిఘా ఉంచారు. అందుకనే ఇప్పుడు ఎన్నికల్లో మహిళా సంఘాల ఓట్లపై ప్రత్యేక వల విసురుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల కాక మునుపే అధికార సిట్టింగ్ ఎమ్మెల్యేలు అంతా మహిళా గ్రూపులను పర్యవేక్షించే రీసోర్స్ పర్సన్‌లను తమ అదుపాజ్ఞలో ఉంచుకున్నారు. వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు. మూడో కంటికి తెలియకుండా కొందరికి ఇళ్ల వద్దకే పంపించారు. చేతికి అందిన బహుమానాలతో కొందరు సంతృప్తిపడితే మరికొందరు అధికార పార్టీకి దాసోహం అయ్యారనే విమర్శలు లేకపోలేదు. ప్రతి రీసోర్స్ పర్సన్(ఆర్పీ) పరిధిలో 25 సంఘాలు ఉంటాయి. వీటిని అదుపుచేసే బాధ్యత ఆర్పీదే. సాధారణంగా ప్రతి గ్రూపునకు ఒక మహిళా లీడర్ అంతా పర్యవేక్షిస్తారు. రుణాలు, చెల్లింపులు ప్రతి నెల బ్యాంకులకు సమర్పించేది వీళ్ళే. ఇంకేముంది ముందుగా బహుమతులతో ఆర్పీలను బుట్టలో వేసుకుంటే ఇక సంఘాల్లో మిగిలిన మహిళలను తమ దారికి తెచ్చుకోవాలని, వీరైతే వారికి ఎలక్షన్ బహుమానం ఇంటికి చేర్చే యోచనలో అధికార పార్టీ ఉంది. దీనికి తగ్గట్లుగానే ఇప్పటికే కొన్ని సామాజికవర్గాలకు చెందిన వారు, అధికారపార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న వారు ఈ ఎన్నికల రణరంగంలో తెరవెనుక తమపాత్ర పోషిస్తున్నట్లుగా చెబుతు న్నారు. గడిచిన నెలలో డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళలను కలిసి మీ ఆధార్ కార్డులు, ప్రతినెల ఆదాయ మార్గాలు, ఇంటి వ్యవహారాలు నమోదు చేసుకునే ప్రయత్నం చేశారు. ఎందుకని ప్రశ్నించిన వారికి కేంద్రం నుంచి రుణాలు వస్తున్నాయి, అందుకనే ఈ వివరాలు సమర్పించాల్సి వచ్చిందంటూ నమ్మబలికే ప్రయత్నాలు చేశారు. వచ్చే ఎన్నికల్లో కీలక భాగం మహిళలదే కాబట్టి అదికూడా డ్వాక్రా సంఘాల్లో ఉన్నవారిని తమవైపు తిప్పుకోవడానికి అధికారపార్టీ అనేక ఎత్తుగడలకు సిద్ధమవుతోంది.



వలంటీర్ల రాజీనామాలకు ఎత్తుగడలు

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

తాడేపల్లిగూడెంలో శుక్రవారం వలంటీర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని భావించి నియోజకవర్గంలోని అందరికీ సమాచారం ఇచ్చారు. కానీ స్పందన లేదు. కొందరు ఫోన్‌లు స్విచ్ ఆఫ్ చేశారు. వైసీపీ నాయకులకు అందుబాటులోకి రాకపోవడంతో సమావేశాన్ని రద్దు చేశారు. ఇప్పటికే భీమవరం, ఆచంట వంటి నియోజకవర్గాల్లో ఒత్తిడి చేసి కొందరితో రాజీనామాలు చేయించారు. కోడ్ అమలులోకి వచ్చిన తర్వాత పెన్షన్ల పంపిణీలో వలంటీర్లకు దూరంగా ఉంచాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. దీనిని సొంత ప్రయోజనాలకు వాడుకోవడానికి వైసీపీ ఎత్తుగడ వేసింది. ప్రతపక్షాలపై అక్కసు వెళ్లగక్కింది. వలంటీర్లను కూటమి వైపు రాజకీయంగా ఎగదోయాలని పన్నాగాలు చేస్తోంది. అధికార పార్టీ తరపున జనంలోకి వెళితే ఛీవాట్లు ఉంటాయన్న ఆవేదన వలంటీర్లలో ఉంది. భీమవరంలో కొందరు ప్రచారానికి పాల్పడితే ప్రజల నుంచి ఛీత్కారాలు ఎదుర్కొన్నారు. న్యాయ కళాశాలలో పనిచేస్తున్న అధ్యాపకుడు ప్రచారానికి వచ్చిన వలంటీర్లను సిగ్గు లేదా ఇంకా వైసీపీకి ప్రచారం చేస్తున్నా రంటూ తిప్పి పంపారు. ఆకివీడు మండలం దుంపగడపలో ఎనిమిది మంది, పెంటపాడు మండలం జట్లపాలెం 18, మీనవల్లూరు ముగ్గురు, రామచంద్రపురం ఒకరు, వల్లూరుపల్లి 11, కోరుమిల్లి 9, చింతపల్లి 8, యానాలపల్లి 8, మౌంజీపాడు 10, ఉమామహేశ్వరంలో ఏడుగురు రాజీనామాలు చేశారు. ఇప్పటి వరకు ఈ మండలంలో 96 మంది రాజీనామాలు చేశారు. జిల్లాలో 9,200 మంది వలంటీర్లకు అధికార పార్టీ ప్రలోభాలతో 1,100 మంది పోస్టులను వదులుకున్నారు.

ధాన్యం కొనుగోలుకు అన్ని ఏర్పాట్లు చేశాం

» పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు



గరగపర్రులో రైతు భరోసా కేంద్రాన్ని సందర్శించిన వెంకటేశ్వరరావు, తదితరులు

పాలకోడేరు, ఏప్రిల్ 12 : దాళ్వా సీజన్‌కు సంబంధించి రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామని పశ్చిమ గోదావరి జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వర రావు తెలిపారు. మండలంలోని గరగపర్రు, గొల్లలకోడేరు, కుముదవల్లి గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించి మాట్లాడారు. పాలకోడేరు మండలంలో 11వేల 500 ఎకరాలకు గాను ధాన్యం కొనుగోలు చేసేందుకు సంచులను సిద్ధం చేశామన్నారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలో 90 శాతం 1,121 రకం వరిసాగు చేశారని, ఈ రకం పంట ఎకరానికి 50 నుంచి 52 బస్తాలు దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం 6,500 సంచులను సిద్ధం చేశామన్నారు. ఈ సందర్భంగా మండలంలోని గరగపర్రు, కుముదవల్లి, గొల్లలకోడేరు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి సూచనలు చేశారు. ఏవో నారాయణరావు, ఎం. స్వరూప, వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు చింతలపాటి సూర్యనారాయణరాజు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

17 కంటే తక్కువగా తేమశాతం ఉండాలి..

ఉండి, ఏప్రిల్ 12 : తేమశాతం 17 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జడ్ వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం చిలుకూరులోని రైతుభరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులంతా తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి అమ్ముకోవాలని, అవసరమైన గోనెసంచులు సిద్ధంగా ఉంచామన్నారు. జిల్లా కో-ఆపరేటివ్ అధికారి నాగరాజు, ఆకివీడు ఏడీఏ శ్రీనివాస్, ఉండి రూరల్ బ్యాంక్ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

15న భీమవరంలో సీఎం జగన్ సభ

» ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి

భీమవరం రూరల్, ఏప్రిల్ 12 : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రోడ్‌షో, సభ ఈనెల 15న భీమవరంలో జరగనున్నట్టు ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మిథున్‌రెడ్డి తెలిపారు. భీమవరంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజున కృష్ణా జిల్లా నుంచి భీమవరం వచ్చి రోడ్ షో, సభ అనంతరం తాడేపల్లిగూడెం రోడ్‌షోగా వెళ్తారన్నారు. కార్యక్రమంలో మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యేలు రంగనాథరాజు, గ్రంధి శ్రీనివాస్, పీవీఎల్ నరసింహరాజు, గూడూరి ఉమాబాల తదితరులు పాల్గొన్నారు.



టి.వినీల డీడీ సాయిశ్రీనివాస్ లాస్యనందిని సాయినిహారిక మేఘన వర్షిణి

ఇంటర్ ఫలితాల్లో శ్రీప్రకాష్ విద్యార్థుల విజయభేరి

తుని రూరల్, ఏప్రిల్ 12: ఏపీ ఇంటర్ బోర్డు ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయభేరి మోగించారు. ఎంపీసీ ద్వితీయ సంవత్సరం నుంచి టి.వినీల 1000కి 982, డీడీ సాయిశ్రీనివాస్ 1000కి 980 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా బైపీసీ ద్వితీయ సంవత్సరంలో కె.లాస్యానందిని 1000కి 979 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. ఎంపీసీ ప్రథమస్థానం నందు డీవీఎల్ సాయి నిహారిక 470కి 464, ఎస్.మేఘన 470కి 463 మార్కులతో అగ్రస్థానంలో నిలిచారు. బైపీసీ ప్రథమ సంవత్సరంనందు జి.వర్షిణి 440కి 428 మార్కులతో అగ్రస్థానంలో నిలిచి ప్రథమ, ద్వితీయ సంవత్సరాలలో తమ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్టు విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్ విజయ్‌ప్రకాష్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు.

జలవనరుల శాఖ ఎస్ఈగా రవిబాబు

పెదవేగి, ఏప్రిల్ 12 :జలవనరుల శాఖ ఎస్ఈగా ఎంఎస్ఎస్.రవిబాబును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జలవనరుల విభాగంలో పదవీ విరమణ చేసిన ఏలూరు ఎస్ఈ స్థానంలో విజయవాడ ఐఎస్‌డబ్ల్యూఆర్ సీఈగా పనిచేస్తున్న ఎంఎస్ఎస్. రవిబాబును ఏలూరు జిల్లా జలవనరులశాఖ ఎస్ఈగా నియమించారు. అలాగే జలవనరుల శాఖ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సీహెచ్.దేవప్రకాష్‌ను ఏలూరు పీఐపీఆర్ఎంసీ డివిజన్-4 ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు. పదవీ విరమణతో ఖాళీ అయిన ఈ స్థానాల్లో నియమించిన అధికారులు పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించేలా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

వైభవంగా సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ



శ్రీరామాలయంలో ప్రతిష్ఠ చేసిన విగ్రహాలు

కైకలూరు, ఏప్రిల్ 12: రామాలయం జీర్ణోద్ధరణ, పునఃప్ర తిష్ఠ మహోత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం వేమవరప్పాడులో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహాలను ప్రతిష్ఠించారు. కైకలూరు అసెంబ్లీ బీజేపీ అభ్యర్థి డాక్టర్ కామినేని శ్రీనివాస్, ఏలూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి పుట్టా మహేష్‌కుమార్ యాదవ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనను పుట్టా మహేష్ ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్దఎత్తున విచ్చేశారు.

17 నుంచి రఘునాథస్వామి కల్యాణోత్సవాలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 12: నూజివీడు మండలం గొల్లపల్లి గ్రామంలోని రఘునాథస్వామి తిరుకల్యాణ మహోత్సవాలను ఈనెల 17 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తామని దేవదాయ ధర్మదాయశాఖ ఈవో ఎస్.సతీష్‌కుమార్ తెలిపారు. ప్రసిద్ధ యదుపురి క్షేత్రంలోని కల్యాణ మహోత్సవాల్లో భాగంగా 17న స్వామివారిని పెండ్లికుమారుడిని చేయటం, 20వ తేదీ రాత్రి తొమ్మిది గంటలకు స్వామి వారి కల్యాణం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని, 21న స్వామివారికి ఊంజల్ సేవ, హనుమంతవాహనంపై గ్రామోత్సవం, 22న రథోత్సవం, 23న గరుడ వాహనంపై స్వామివారి గ్రామోత్సవం, 24వ తేదీ శేషవాహనంపై గ్రామోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

12-04-2024 పొగాకు ధరలు (రూ.)



పొగాకు కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం	సరాసరి
దేవరపల్లి	242	225	234.16
జంగారెడ్డిగూడెం-1	243	235	240.28
జంగారెడ్డిగూడెం-2	243	235	239.68
కొయ్యలగూడెం	243	235	239.98
గోపాలపురం	242	235	239.68

తాటి ముంజలకు భలే గిరాకీ

డజను రూ.50 చొప్పున అమ్మకాలు

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 12 : వేసవి వచ్చిందంటే తాటి ముంజలకు గిరాకీ ఉంటుంది. అనేక ఔషధ గుణాలు కలిగి ఉండడంతో పాటు ఎండ వేడిమి తాపాన్ని నివారిస్తుంది. పట్టణంలోని బస్టాండ్ రోడ్డులో వెలివెలకి చెందిన దింపు కార్మికుడు తంగెళ్ళ రమేష్ తన గ్రామం నుంచి రోజూ ముంజకాయల గెలలను తీసుకువచ్చి విక్రయిస్తున్నాడు. రోజుకు రూ.1500 వరకు ఆదాయం వస్తోందని, మున్సిపల్ పన్నుగా రూ.100 చెల్లిస్తున్నానని, ఖర్చులు పోనూ తనకు సుమారుగా రూ.800 మిగులుతోందని చెప్పాడు. వేసవి సీజన్ అయిన తరువాత కొబ్బరి దింపు, కాయలు వలుపు చేస్తూంటానని చెబుతున్నాడు. కాయ ఒకటికి రూ.10, ముంజలు తీసి ఇస్తే డజను (12) రూ. 50లుకు విక్రయిస్తున్నట్టు తెలిపారు. వేసవి కావడంతో అనేక మంది వచ్చి కొనుగోలు చేస్తున్నారని, వ్యాపారం బాగుందని తెలిపాడు.



పాలకొల్లులో ముంజలు విక్రయిస్తున్న గీత కార్మికుడు రమేష్ (ఇన్‌సెట్‌లో) తీసిన ముంజలు

ఉత్సాహంగా రాష్ట్రస్థాయి చదరంగం పోటీలు



విజేతలకు బహుమతులు అందించిన పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి

ఏలూరు స్పోర్ట్స్, ఏప్రిల్ 12 : ఆంధ్రా చెస్ అసోసియేషన్, ఏలూరు జిల్లా చెస్ అసోసియేషన్ సహకారంతో ఏజీ సీఏ, ఎంకేటీజీ ఆధ్వర్యంలో ఆంధ్ర రాష్ట్ర ర్యాపిడ్ ఓపెన్ చెస్ టోర్నమెంట్ వట్లూరు సిద్ధార్థ ఫెస్ట్ స్కూల్లో శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమ య్యాయి. ఈ పోటీలను రాష్ట్ర సాహిత్య అకాడమి చైర్మన్ పిల్లంగోళ్ళ శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ చదరంగం వల్ల జ్ఞాపకశక్తి, చురుకుదనం, క్రమశిక్షణ అలవడతాయన్నారు. ఈ పోటీలకు పలు జిల్లాల నుంచి 192మంది క్రీడాకారులు పాల్గొన్నారు. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో టి.లక్ష్మణరావు, అభిరామ్, ఎల్.మౌళి, ఎం.బాలశ్రీనివాసరావు, సీహెచ్ వివేక్, ఎం.శ్రీనివాసరావు, ఎల్.అరవింద్‌బాబు, ఎ.అరుణకుమారి, హరీష్, ఎస్.వినయ్, బాలు, సాయికుమార్ జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారని అకాడమి డైరెక్టర్ యోహానస్ తెలిపారు. స్కూల్ వీటీకే సిద్ధార్థ కృష్ణ, వంశీకృష్ణ, వై.మహేష్, కనకలక్ష్మి, అరుణ, పి.కిరణ్‌కుమార్ తదితరులు పర్యవేక్షించారు.

చెక్‌పోస్టుల్లో ప్రత్యేక బృందాల తనిఖీలు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 : జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి, ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు ఆదేశాల మేరకు ఎస్ఈబీ ప్రత్యేక బృందాలు జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో ఆకస్మికంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులైన కృష్ణాపురం, చాట్రాయి మండలం పార్వతీపురం గ్రామాల్లోని చెక్‌పోస్టులను తనిఖీ చేశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేసి అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.కోటేశ్వరరావు, మైలవరం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సి.భార్గవ, మైలవరం ఇన్‌స్పెక్టర్ కె.కిషోర్‌బాబు పలువురు అధికారులు చెక్‌పోస్టులను పరిశీలించారు. సరిహద్దు గ్రామాల వెంబడి తనిఖీలు తీవ్ర తరం చేయాలని, ప్రణాళికలపై ఉభయ గోదావరి జిల్లాల అధికారులు చర్చించుకున్నారు.



కృష్ణాపురంలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఈబీ ప్రత్యేక బృందాలు

రూ.3.66 లక్షలు స్వాధీనం : ఎస్పీ ప్రశాంతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 : సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ఏలూరు జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎస్పీ మేరీ ప్రశాంతి అన్నారు. గడిచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 12.35 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామని వాటి విలువ 2,240 రూపాయలు అని తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు మూడు లక్షల 66 వేల 500 రూపాయలు అని ఎస్పీ తెలిపారు.

మార్కండేయపురం వద్ద రూ.2.36 లక్షలు సీజ్

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 12 : ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా మోటార్ సైకిల్‌పై పరిమితికి మించి నగదు తరలిస్తున్న ఓ వ్యక్తి నుంచి స్వాధీనం చేసుకుని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారికి ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది అప్పగించారు. జంగారెడ్డిగూడెం నుంచి బుట్టాయగూడెంకు ఓ వ్యక్తి ద్విచక్రవాహనంపై రూ.2,36,500 తరలిస్తుండగా మార్గమధ్యలోని మార్కండేయపురం వద్ద శుక్రవారం వాహన తనిఖీల్లో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్ నగదును గుర్తించారు. వాటిని లెక్కించి స్క్వాడ్ ఇన్‌చార్జి కేవీ రమణ ఆ నగదును తహసీల్దార్, ఏఆర్‌వో స్వీవజోజికి అప్పగించారు. దాడుల్లో కానిస్టేబుల్ కోటేశ్వరరావు, అబ్బులు, పవన్‌కుమార్, మంగరాజు తదితరులు ఉన్నారు.

ఇద్దరి నుంచి రూ. లక్షా 72 వేలు సీజ్



కొత్తూరు ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

కామవరపుకోట, ఏప్రిల్ 12 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కొత్తూరులోని ఎన్నికల చెక్‌పోస్ట్ వద్ద ఇద్దరు వ్యక్తుల నుంచి ఒక లక్షా 72 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల అధికారి కె.శేషగిరిరావు తెలిపారు. వాహనాల తనిఖీలలో భాగంగా బయ్యన్నగూడెంకు చెందిన వ్యక్తినుంచి రూ.85 వేలు, ఏలూరుకు చెందిన వ్యక్తి నుంచి రూ.87 వేలను సరైన ధ్రువపత్రాలు చూపించనందున స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. తనిఖీలలో ఏఎస్ఐ వీరాస్వామి, పోలీసులు, వీఆర్‌వోలు తదితరులు ఉన్నారు.

క్రైం సమాచారం

వేర్వేరుచోట్ల ఐదుగురి మృతి

ఏలూరు జిల్లాలో వేర్వేరు చోట్ల శుక్రవారం మొత్తం ఐదుగురు మృతి చెందారు. ఉంగుటూరు మండలం చింతాయగూడెంనకు చెందిన ఒకరు ఆత్మహత్యకు పాల్పడగా, టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన మరొకరు చికిత్స పొందుతూ మృతి చెందారు. పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి ఓ యువకుడు చికిత్స పొందుతూ మరణించాడు. ద్వారకాతిరుమల మండలం అనుమాలగూడెం గ్రామానికి చెందిన మరో యువకుడు తీవ్రగాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆగిరిపల్లి మండలం చిన్నాగిరిపల్లి శివారు గొల్లగూడెం గ్రామంలో ఓ మహిళా వ్యవసాయ కూలీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

పురుగుల మందు తాగి ఒకరి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 : ఏ కారణమో తెలియదు కాని ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉంగుటూరు మండలం చింతాయగూడెంనకు చెందిన పులపాక ఏసుబాబు(50)కు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఏ కారణమో తెలియదు కాని శుక్రవారం మధ్యాహ్నం తన ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతడిని గమనించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించి ఎమ్మెల్సీగా నమోదు చేశారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఈ సంఘటపై భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

టి.నరసాపురం, ఏప్రిల్ 12 : కలుపు మందు తాగి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. మక్కినవారిగూడెం గ్రామానికి చెందిన తడికిమళ్ళ చందు(25) కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇటీవల చెడు వ్యసనాలకు బానిస కావడంతో తండ్రి వెంకటేశ్ మందలించాడు. మనస్తాపం చెందిన యువకుడు ఈనెల 5న కలుపు మందు తాగాడు. కుటుంబ సభ్యులు చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి అక్కడ నుంచి విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో శుక్రవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ జయకుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ మరో యువకుడు..

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 : రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ యువకుడు శుక్రవారం మృతి చెందాడు. పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన గురజాల శ్యామ్‌బాబు(21) తన స్నేహితుడైన పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన మారుమూడి సతీష్ మోటారు సైకిల్‌పై ఈనెల 9వ తేదీన ఏలూరు వచ్చి తిరిగి వెళ్తుండగా చొదిమెళ్ళ ఎఫ్‌సీఐ గోడౌన్స్ వద్ద మోటారు సైకిల్ నడుపుతున్న సతీష్ ఆకస్మాత్తుగా బ్రేక్‌వేశాడు. వారిద్దరూ కింద పడగా తీవ్ర గాయాలకు గురైన శ్యామ్‌బాబు గుంటూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఈ సమాచారం ఏలూరు రూరల్ పోలీసులకు అందడంతో రూరల్ ఎస్ఐ కె.రాజారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

క్రికెట్ బెట్టింగ్ వివాదంతో యువకుడి బలి

» ఇద్దరు వ్యక్తుల దాడి.. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 12: క్రికెట్ బెట్టింగ్ విషయంలో జరిగిన వివాదం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. ఇద్దరు వ్యక్తులు కలసి దాడి చేసి ఓ యువకుడి ప్రాణాలు తీశారు. ఈ ఘటన ద్వారకాతిరుమల పంగిడిగూడెం పంచాయతీ అనుమాలగూడెంకు చెందిన జొన్నకూటి రవి(29) ఈనెల 7న క్రికెట్ ఆడేందుకుగాను మండలంలోని ఎం.నాగులపల్లి పంచాయతీ మత్తేవారిగూడెంకు వెళ్లాడు. బెట్టింగ్ విషయంలో అదే గ్రామానికి చెందిన గుండుగొంటి మహేష్‌బాబు, గుండుగొంటి బాబులతో గొడవ జరిగింది. ఆ ఇద్దరూ రవిపై విచక్షణారహితంగా దాడి చేశారు. ఈనెల ఎనిమదో తేదీన రవి ఓ ఆర్ఎంపీ వైద్యుడి వద్ద చికిత్స చేయించుకున్నాడు. తొమ్మిదో తేదీన అస్వస్థతకు గురవ్వడంతో అతడిని గుంటూరు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గాయపడిన మహిళా కూలీ మృతి



శివమ్మ(ఫైల్)

ఆగిరిపల్లి, ఏప్రిల్ 12: ఆగిరిపల్లి మండలం చిన్నాగిరిపల్లి శివారు గొల్లగూడెం గ్రామంలో గత నెల 26న జరిగిన ఆటో ప్రమాదంలో ఇద్దరు మహిళా వ్యవసాయ కూలీలు మృతి చెందిన విషయం విదితమే. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బడుగు శివమ్మ (32) చికిత్స పొందుతూ అవుటపల్లి పిన్నమనేని ఆసుపత్రిలో శుక్రవారం తుదిశ్వాస విడిచింది. ఈమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

న్యాయం ఏదీ ?

» ప్రైవేట్ లైన్‌మన్ షణ్ముకం మృతి చెంది నాలుగు నెలలు

» నేటికీ ఆ కుటుంబానికి అందని సాయం

» బాధ్యుల్ని కాపాడేందుకు ప్రయత్నాలు



షణ్ముఖం(ఫైల్)

నరసాపురం, ఏప్రిల్ 12: నరసాపురం పట్టణంలో ప్రైవేట్ లైన్‌మన్ షణ్ముఖం అంటే తెలియని వారు ఉండరు.. ఎవరి ఇంట్లోనైనా కరెంట్ పోతే ముందుగా కరెంట్ ఆఫీసుకు కాకుండా అతడికే ఫోన్ చేస్తారు.. సేవే లక్ష్యంగా పని చేస్తాడని మంచి పేరుంది. తమిళనాడు నుంచి వచ్చిన స్థిరపడిన అతని సేవల్ని ఎక్కువగా ఈపీడీసీఎల్‌లోనే సిబ్బంది ఎక్కువగా వినియోగించుకున్నారు. కొంతమంది వైట్‌కాలర్ సిబ్బంది అతడిని అడ్డం పెట్టుకుని ఉద్యోగులుగా చలామణి అవుతూ వస్తున్నారు. జీతంలో కొంత మొత్తాన్ని అతడికి ఇస్తూ దర్జాగా గడిపేసేవారు. గత ఏడాది డిసెంబరులో ఒక కొత్త విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు వెళ్లిన అతడు విద్యుత్‌షాక్‌కు గురై తీవ్ర గాయాలకు గురయ్యాడు. ఈ విషయాన్ని బయటకు రాకుండా ఏలూరు తరలించి చికిత్స చేయించినప్పటికీ మృతి చెందాడు. అప్పట్లో అతడి మృతి పట్టణంలో పెద్ద సంచలనమైంది, ఆ కుటుంబానికి న్యాయం చేయాలని చాలామంది విశాఖలోని ఈపీడీసీఎల్ అధికారులకు ఫిర్యాదులు చేశారు. సంఘటన జరిగి నాలుగు నెలలు గడిచినప్పటికీ ఆ కుటుంబానికి ఎటువంటి పరిహారం అందలేదు. బాధ్యులైన ఉద్యోగులపై చర్యలు లేవు. ఇంకా విచారణ పేరుతోనే కాలయాపన చేస్తున్నారు. ఈ వ్యవహారంలో జిల్లాకు చెందిన ఓ ఈపీడీసీఎల్ అధికారి బాధ్యులైన ఉద్యోగులను కాపాడుతున్నాడన్న గుసగుసలు ఆ శాఖలోనే వినిపిస్తున్నాయి. దీనికంటే వెనుక జరిగిన నరసాపురం మండలం కె.బేతపూడి ప్రైవేట్ లైన్‌మన్ మృతికి బాధ్యుడిగా చూపించి కొప్పర్రు లైన్‌మన్‌ను సస్పెండ్ చేశారు. బాధిత కుటుంబానికి పరిహారం అందించారు. నిస్వార్థంగా పేరు సంపాదించిన షణ్ముఖం కుటుంబానికి మాత్రం న్యాయం జరగలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా ఈపీడీసీఎల్ ఉన్నతాధికారులు కళ్లు తెరుస్తారో లేదో వేచి చూడాల్సి ఉంది.

భార్య, చిన్నారి మృతదేహాల లభ్యం



యోచన, నిధిశ్రీ మృతదేహాలు

యలమంచిలి, ఏప్రిల్ 12: భీమవరానికి చెందిన బొంతు కిషోర్‌కుమార్ కుటుంబం బుధవారం గోదావరిలో దూకి ఆత్మహత్యకు చేసుకున్న ఘటనలో మూడో రోజు శుక్రవారం పోలీసులు గోదావరిలో గాలింపు చర్యలు కొనసాగించారు. సోంపల్లి సమీపంలో భార్య బొంతు యోచన, రెండేళ్ల కుమార్తె నిధిశ్రీ మృతదేహాలు లభ్యమయ్యాయి. భర్త కిషోర్‌కుమార్ మృతదేహం గురువారం లభ్యమైన విషయం విదితమే.. ఆర్థిక ఇబ్బందులు కారణంగా రెండేళ్ల పసిపాపతో కలిసి భార్యభర్తలు గోదావరిలో దూకి ఆత్మహత్యకు పాల్పడడం పలువురిని కలచివేసింది.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

తణుకు, ఏప్రిల్ 12 : తణుకు పట్టణ పరిధిలోని ఇరిగేషన్ కార్యాలయం సమీపంలోని పాడుబడ్డ భవనాల వద్ద గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందని పట్టణ ఎస్ఐ కె.శ్రీనివాసు శుక్రవారం తెలిపారు. మృతుడి వయస్సు 30 నుంచి 40 ఏళ్లు ఉంటుందన్నారు. మృతదేహం కుళ్లి దుర్వాసన వస్తుందని, శరీరంపై బట్టలు లేవన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

తండ్రి అదృశ్యంపై కుమారుడి ఫిర్యాదు

ఆకివీడు, ఏప్రిల్ 12: తన తండ్రి అదృశ్యమయ్యాడని కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్ కానిస్టేబుల్ జి.దివాకర్ తెలిపారు. కుప్పనపూడికి చెందిన కట్రెడ్డి రామారావు(63) గురువారం రాత్రి గుమ్ములూరు సెంటర్‌కు వెళ్లి తిరిగి రాలేదన్నారు. చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల వద్ద ఆచూకీ లేదన్నారు. ఈ మేరకు బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

బాలికపై అత్యాచార యత్నం.. పోక్సో కేసు

టి.నరసాపురం, ఏప్రిల్ 12 : బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఓ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ డి.దుర్గామహేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలివి.. మండలంలోని ఓ గ్రామంలో రెండో తరగతి చదువుతున్న బాలికను అదే గ్రామానికి చెందిన 38 ఏళ్ల వ్యక్తి చీమలు తొలగిస్తానని చెప్పి ఇంటికి తీసుకెళ్లి అత్యాచార యత్నానికి పాల్పడినట్టు తెలిసింది. బాలిక శరీరంపై గాయాలు గుర్తించిన ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆ వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేశామన్నారు.

టెక్నోఫెస్ట్‌లతో విద్యార్థులు ప్రతిభ చాటాలి

» వీసీ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 12: టెక్నోఫెస్ట్‌ల ద్వారా విద్యార్థులు తమ ప్రతిభ చాటేందుకు సిద్ధంగా ఉండాలని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ వీసీ, ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమచంద్రారెడ్డి అన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో టెక్ జెట్-24 జాతీయ స్థాయి టెక్నో మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌ను శుక్రవారం ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్జీయూకేటీ నాణ్యమైన, విభిన్నమైన విద్యను అందిస్తోందని, మానవ సంక్షేమం కోసం నూతన విషయాలను ఆవిష్కరించటానికి విద్యార్థులు సాంకేతికతలో మార్పులను నేర్చుకుంటూ నూతన విషయాలను ఆవిష్కరిస్తూ ముందుకు సాగాలన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ వేగంగా మారు తున్న సాంకేతికతను, నైపుణ్యాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలన్నారు. పారిశ్రామిక అవసరాలను తీర్చడానికి టెక్నాలజీ రేసులో పరిగెత్తాలన్నారు. ఈ సందర్భంగా టెక్నో జెట్‌లో 1,171 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకున్నట్టు టెక్ జెట్ కన్వీనర్ డాక్టర్ జ్యోతిలాల్ నాయక్ తెలిపారు. రెండురోజుల పాటు నిర్వహించే ఈ-టెక్‌జెట్‌లో 12 వర్క్‌షాపులతో పాటు 33 టెక్నికల్ ఈవెంట్‌లు నిర్వహిస్తామన్నారు. ప్రొఫెసర్ గోపాలరాజు, రిజిస్ట్రార్ బి.శ్రావణి, డీన్ బి.శ్రీనాథ్, ఫైనాన్స్ ఆఫీసర్ రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు.

16 నుంచి భద్రాచలంకు ప్రత్యేక బస్సులు

» ఏలూరు జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి వరప్రసాద్



ఏలూరు రూరల్, ఏప్రిల్ 12: శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా ఈనెల 16వ తేదీ నుంచి 18 వరకు భద్రాచలంకు ప్రత్యేక ఆర్టీసీ బస్ సర్వీసులు నడపనున్నట్టు ఏలూరు జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి ఎన్.వి.ఆర్ వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ ఈనెల 17న శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం సీతారామచంద్రుల కల్యాణానికి వెళ్లే భక్తుల కోసం ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు ప్రత్యేకబస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఒక ఊరునుంచి 50 మంది వెళితే ఆ ప్రదేశంనుంచి ప్రత్యేక సర్వీస్ కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. మరింత సమాచారానికి దగ్గరలోని డిపో మేనేజరును సంప్రదించవచ్చన్నారు. ఏడాదికి ఒకసారి వచ్చే సీతారాముల కల్యాణాన్ని భక్తులు కన్నులారా వీక్షించి క్షేమంగా ఆర్టీసీబస్సుల్లో ప్రయాణించాలని తెలిపారు.

26 అనధికార మద్యం సీసాల స్వాధీనం

» చిన్నంపేటకు చెందిన వ్యక్తి అరెస్ట్



స్వాధీనం చేసుకున్న మద్యంతో సెబ్ అధికారులు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 12: నూజివీడు సెబ్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో 26 అనధికార మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్టు సెబ్ సీఐ వెంకట రమణ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చాట్రాయి మండలం కృష్ణారావుపాలెం చెక్‌పోస్ట్ వద్ద నిర్వహించిన దాడుల్లో చాట్రాయి మండలం చిన్నంపేటకు చెందిన శ్యామల వెంకటేశ్వరరావు అనే నిందితుడిని అదుపులోకి తీసుకుని అతడి నుంచి మొత్తం 26 మద్యం సీసాలను స్వాధీన పర్చుకున్నట్లు తెలిపారు. అలాగే నూజివీడు మండలం సిద్ధార్థనగర్ తండాలో నిర్వహించిన దాడుల్లో 1200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి 20 లీటర్ల సారాను స్వాధీన పరుచుకున్నామన్నారు. రేగుంటలో 50 లీటర్ల సారాను స్వాధీన పరుచుకుని వెయ్యి లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం చేసినట్టు తెలిపారు.

ఎస్ఈబీ విస్తృత దాడులు

ఏలూరు క్రైం, ఏప్రిల్ 12 : ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్ఈబీ ప్రత్యేక బృందాలు విస్తృతంగా దాడులు చేపట్టారు. నూజివీడు ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో దాడులు నిర్వహించి 70 లీటర్ల నాటుసారా, 2,200 లీటర్ల బెల్లపు ఊటను, ఒక మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఆ సారా బట్టీ నిర్వాహకులను గుర్తించారు. సిద్ధార్థ నగర్ తాండా ప్రాంతంలో 1,200 లీటర్ల బెల్లపుఊట, 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. రేగుంట గ్రామంలో 50 లీటర్ల నాటుసారా, వెయ్యి లీటర్ల బెల్లపు ఊటను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత నిందితులపై కేసులు నమోదు చేశామని ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్ కుమార్ తెలిపారు.



ఎస్ఈబీ అధికారులు స్వాధీనం చేసుకున్న సారా, బెల్లపు ఊట

మారమ్మ ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పాలకోడేరు, ఏప్రిల్ 12: పాలకోడేరు గరువు వద్ద శ్రీమారమ్మ జాతరలో భాగంగా ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నాడు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు మాట్లాడుతూ ఉగాది పర్వదినం పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక పూజలు, విశేష అభిషేకాలు, చండీ పారాయణ హోమాలు, జాతర మహోత్సవ కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.

చిన మావుళ్ళమ్మ ఆలయంలో అన్నదానం

భీమవరం టౌన్, ఏప్రిల్ 12: టూటౌన్‌లోని రామరాజు తోటలో మావుళ్ళమ్మ అమ్మవారికి శుక్రవారం సందర్భంగా విశిష్ట పూజలు నిర్వహించి, అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మావుళ్ళమ్మ సేవాసమితి అధ్యక్షురాలు రామాయణం వెంకటలక్ష్మీ తులసి పార్వతి, కార్యదర్శి రేవూరి గోగురాజు మాట్లాడుతూ ఐదు సంవత్సరాలుగా ప్రతి శుక్రవారం అమ్మవారికి విశిష్ట పూజలు నిర్వహించి, భక్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ నిర్వహిస్తున్నామని, శుక్రవారంనాడు చుక్కల వెంకటరమణ, ఐలా రాంబాబు, పోలిశెట్టి వెంకటేశ్వరరావు దంపతుల సౌజన్యంతో 300 మందికి అన్న ప్రసాదం అందించామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆకివీడు, ఏప్రిల్ 12: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలు వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు విద్యుత్‌శాఖ డీఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఆకివీడు టౌన్‌తో పాటు అజ్జమూరు, దుంపగడప, అయి-భీమవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

నరసాపురం రూరల్: రుస్తుంబాదా సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం శనివారం ఆరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ బి.సురేష్‌కుమార్ తెలిపారు. వైఎస్‌పాలెం, మంగళగుంటపాలెం, కొప్పర్రు, లక్ష్మణేశ్వరం,సార్వా, రాజుల్లంక గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 2గంటలకు సరఫరా ఉండదన్నారు.

పాలకోడేరు: విద్యుత్ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు కొన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. గొల్లలకోడేరు, గరగపర్రు, యండగండి, షైపా గ్రామాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

ఎస్సీ పథకాలు పునరుద్ధరిస్తాం


ఊటాడలో ఎమ్మెల్యే రామనాయుడును ఆశీర్వదిస్తున్న పాస్టర్

యలమంచిలి, ఏప్రిల్ 12: జగన్ రద్దుచేసిన 27 ఎస్సీ సంక్షేమ పథకాలను టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో పునరుద్ధరిస్తామని ఎమ్మెల్యే డాక్టర్ నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. ఊటాడ గ్రామంలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నిమ్మల మాట్లాడుతూ పేదల గృహ నిర్మాణాలకు ఇచ్చే లక్షా యాభైవేల రూపాయ లతోపాటు కూటమి ప్రభుత్వంలో మరో రూ.50వేలు అదనంగా ఇస్తామని అన్నారు.

రాష్ట్ర భవిష్యత్ కోసం కూటమిని గెలిపించాలి


జగన్నాథపురంలో ప్రచారం చేస్తున్న జనసేన అభ్యర్థి నాయకర్

మొగల్తూరు, ఏప్రిల్ 12: రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఆయా పార్టీల నాయకులు కోరారు. శుక్రవారం జగన్నాథపురంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో అసెంబ్లీ అభ్యర్థిబొమ్మిడి నాయకర్, మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు, జనసేన నాయకులు చాగంటి మురళీ పాల్గొన్నారు. వారు గ్రామంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

నరసాపురం టౌన్: పట్టణంలోని 13వార్డులో జనసేన పార్టీ కూటమి నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బొమ్మిడి నాయకర్‌ను గెలిపించాలంటూ తల్లి ఝాన్సీ , కుమార్తె శ్రయ ఇంటింటికి వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. కోటిపల్లి వెంకటేశ్వరావు, తోట శ్రీధర్, కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, మల్లాడి మూర్తి, సంకు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల మేలు కోరేది కూటమి

పోడూరు, ఏప్రిల్ 12: మహిళల మేలు కోరేది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమేనని ఎమ్మెల్యే రామానాయుడు సతీమణి నిమ్మల సూర్యకుమారి అన్నారు. జిన్నూరు గ్రామంలో పార్టీల శ్రేణులతో కలిసి శుక్రవారం ఆమె ఇంటింటి పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యకుమారి మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండే రామానాయుడును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ మహిళా ఉపాధ్యక్షురాలు కర్నేన రోజారమణి, రాష్ట్ర టీడీపీ ఎస్సీసెల్, బీసీసెల్, శెట్టిబలిజ కార్యదర్శులు దాసరి రత్నరాజు, పాలవలస తులసీరావు పాల్గొన్నారు.

జగన్ ధన దాహానికి రాష్ట్రం బలి

తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 12: జగన్ ధన దాహంతో రాష్ట్రం అధోగతిపాలైందని, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. నందమూరు నుంచి వైసీపీ నాయకులు, మాజీ సర్పంచ్ వేమన సత్యనారాయణ, ఆయన కోడలు గంగాభవాని జనసేన మండల అధ్యక్షుడు అడపా ప్రసాద్ ఆధ్వర్యంలో జనసేనలో చేరగా బొలిశెట్టి వారికి జనసేన కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు.


ఐక్యత చాటుతున్న టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు

బీసీలకు వైసీపీ తీవ్ర అన్యాయం

పెంటపాడు, ఏప్రిల్ 12: బీసీల సంక్షేమ పథకాలను రద్దు చేసి వైసీపీ వారికి తీవ్ర అన్యాయం చేసిందని కూటమి ఎంపీ అభ్యర్థి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఎమ్మెల్యే అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ అన్నారు. శుక్రవారం పడమరవిప్పర్రులో బీసీ ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం జగన్ అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని ఏళ్ళ తరబడి అధ్వానంగా ఉన్న పడమరవిప్పర్రు రహదారి నేటికి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి విజయానికి సహకరించాలని కోరారు.

రైల్వే స్టేషన్‌లో 9 సిమెంట్ బెంచీల ఏర్పాటు



పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 12 : రైల్వే స్టేషన్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం చవాకుల చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ చవాకుల సూర్య నరేష్‌బాబు సమకూర్చిన 9 సిమెంట్ బెంచీలను శుక్ర వారం రైల్వే బోర్డు మెంబరు, పట్టణ బీజేపీ అధ్యక్షుడు జక్కంపూడి కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో రైల్వే సూపరింటెండెంట్ తాడిశెట్టి రామలింగేశ్వరరావు, స్థానిక నాయకులు కొల్లికొండ ప్రసాద్, కొణిజేటి గుప్త, గవర పవన్ నాయుడు, కేవీఎస్‌బీ పవన్, నంద్యాల రమేష్, ఎం.ప్రసాద్, ఎం.భాస్కరరావు పాల్గొన్నారు.

కార్మికులకు నష్టం కలిగించిన పార్టీలను ఓడించాలి

భీమవరం అర్బన్, ఏప్రిల్ 12: ఉద్యోగ కార్మికులకు తీవ్ర నష్టం చేసిన కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో టీడీపీ కూటమి, వైసీపీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని సీఐటీయు జిల్లా అధ్యక్షులు జెఎన్‌వీ గోపాలన్ పిలుపు నిచ్చారు. శుక్రవారం రైస్ మిల్లు కార్మికుల విస్తృత సమావేశం సీఐటీయు కార్యాలయంలో జరిగింది. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో యజమానులకు లాభం చేకూర్చే లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం తెచ్చిందన్నారు. జిల్లా రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బి.వాసుదేవరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.


తణుకులో ప్రచారం చేస్తున్న టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి.. కృష్ణ తులసి

మద్యం అమ్మకాలతో లక్ష కోట్ల లూటీ: ఆరిమిల్లి

తణుకు, ఏప్రిల్ 12: మద్యం అమ్మకాల ద్వారా సీఎం జగన్ రెడ్డి లక్ష కోట్లు లూటీ చేశారని తణుకు టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ ఆరోపించారు. శుక్రవారం ఆయన పట్టణంలోని 13వ వార్డులో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. నాసిరకం బ్రాండ్ల కారణంగా రాష్ట్రంలో వందల మంది చనిపోయారని, వేల మంది అనారోగ్యం పాలయ్యారన్నారు. మద్యం అమ్మకాలపై కూడా జగన్ ప్రభుత్వం అప్పులు తెచ్చేసిందని, దీంతో రాగల కాలంలో కూడా మద్యం విక్రయాల్ని నియంత్రించడం కుదరదని, ఇలాంటి ప్రభుత్వాన్ని ఇంటికి పంపి కూటమిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ నాయకులు పరిమి వెంకన్నబాబు, షేక్ సూరా సాహెబ్, ఒమ్మి రాంబాబు, తాతపూడి మారుతీరావు, మృత్యుంజయరావు, సత్యనారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన: కృష్ణ తులసి

తణుకు, ఏప్రిల్ 12: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని టీడీపీ కూటమి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణ తులసి అన్నారు. శుక్రవారం పట్టణంలోని 23, 26 వార్డుల్లో రాధాకృష్ణ తరఫున ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అభివృద్ధికి ఓటేద్దామని, అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపుదామన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు బసవా రామకృష్ణ, మల్లిన రాధాకృష్ణ, కొయ్యాని సత్యనారాయణ, నాగళ్ల సత్య శ్రీనివాసు, చుండూరి శేషాద్రి, అంగరాజు ధనరాజు, గుమ్మళ్ళ హనుమంతరావు, భీమనాధుని సుబ్బారావు పాల్గొన్నారు.

అవకాశం ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా: శివ



కాళ్ళ, ఏప్రిల్ 12 : స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని వేటుకూరి వెంకట శివరామరాజు ప్రజలను కోరారు. జువ్వలపాలెం, పెదఅమిరం గ్రామాలలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతీ వీధికి ఆటోలో తిరుగుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కలవపూడి సర్పంచ్ గేదల జాన్, మాజీ ఎంపీటీసీ బొత్సా గణేష్, బురాడ వెంకటకృష్ణ, కాలవ వెంకట్రావు, వంజరపు దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు



మొగల్తూరు, ఏప్రిల్ 12: ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మొగల్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో 72 మంది గర్భిణులను పరీక్షించి వారికి చెందిన మెడికల్ రిపోర్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా ముగ్గురు గర్భిణులను హైరిస్క్‌గా గుర్తించి నరసాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ దినేష్, డాక్టర్ లక్ష్మీపార్వతి, సిబ్బంది వై విజయలక్ష్మీ, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

అగ్నిమాపక వారోత్సవాలు

భీమవరం టౌన్, ఏప్రిల్ 12 : శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో కళాశాలల ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ యూనిట్ల సహకారంతో నిర్వహించే అగ్నిమాపక వారోత్సవాల బ్రోచర్లను భీమవరం ఆర్.ఆర్.డి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ వికెజె ప్రసూన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో అగ్ని ప్రమాదాలు జరగకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వారం రోజులపాటు వివిధ కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

సీఏఏ విరమించుకోవాలి

పెనుగొండ, ఏప్రిల్ 12: నరేంద్రమోదీ నాయకత్వంలో బీజేపీ ప్రభుత్వం సీఏఏ అమలు కోసం నిబంధనలు ప్రకటించడాన్ని అవాజ్ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తుందని అవాజ్ సంఘ నాయకులు షేక్ పాదుషా అన్నారు. సిద్ధాంతం మసీదులో అవాజ్ సంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశ సమైక్యతకు ప్రమాదకరమైన సీఏఏ నిబంధనలను వెంటనే ఉపసహించుకోవాలన్నారు.

ఈవీఎం, వీవీ ప్యాడ్‌లపై అవగాహన ఉండాలి

ఆచంట, ఏప్రిల్ 12: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఎన్నికల అధికారులు ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌లపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి. స్వామి నాయుడు అన్నారు. ఎన్నికల నియమావళి పై శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పీవో, ఏపీవోలకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ రోజున చేయాల్సిన విధులు సంబంధిత పత్రాలు ఎలా పూర్తి చేయాలి.. వంటి వాటి పై శిక్షణ అధికారులు శిక్షణ ఇచ్చారు. 223 మంది పీవో, ఏపీవోలు పాల్గొనగా 4 మండలాల తహసీల్దార్‌లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఉత్సవాలు

ఆచంట, ఏప్రిల్ 12: వల్లూరులో రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి నూతన ధ్వజ స్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలు వేడుకగా జరుగుతున్నాయి. శుక్రవారం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, యంత్రజపం, నవగ్రహ వంటి పూజా కార్యక్రమాలు జరిగాయి. శనివారం ధ్వజ స్తంభ కార్యక్రమం జరుగును.

రేపు వల్లూరులో జయహో బీసీ సభ

ఆచంట, ఏప్రిల్ 12: ఈ నెల 14న వల్లూరులో జరిగే జయహో బీసీ సభను విజయవంతం చేయాలని నియోజకవర్గ బీసీ సంఘం అధ్యక్షుడు తాళం శ్రీనివాస్ కోరారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ నియోజకవర్గ స్థాయిలో వల్లూరులో జరిగే జయహో బీసీ సమావేశానికి ఉమ్మడి అభ్యర్థి పితాని సత్యనారాయణ ముఖ్యఅతిథిగా హాజరవుతారని ఈ సభకు పెద్ద సంఖ్యలో బీసీలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

శ్రీకాంత్ ఆరోపణలకు ఖండన

భీమవరం టౌన్, ఏప్రిల్ 12 : ఎన్నికలవేళ ఊసరవెల్లిలా రంగులు మారుస్తున్న దేవదాయ ధర్మాదాయ శాఖ సలహాదారు జ్వాలాపురం శ్రీకాంత్ చేస్తున్న అసత్య ఆరోపణలను నర సాపురం పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ సాధికారిక సమితి తీవ్రంగా ఖండించింది. శుక్రవారం జరిగిన సమావేశంలో సాధికారక సమితి పార్లమెంటు కన్వీనర్ చెరుకుపల్లి సంతోష్ కుమార్ మాట్లాడుతూ రాజకీయ లబ్ధి పొందడం కోసం తెలుగుదేశం పార్టీ మీద బురద జల్లడం న్యాయం కాదన్నారు. బ్రాహ్మణ కార్పొరేషన్ నిర్వీర్యమైపోతుంటే కళ్ళప్పగించి చూసిన శ్రీకాంత్ ఇప్పుడు తెలుగుదేశం పార్టీని విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. అంతర్వేది రథం గాని, విజయనగరం జిల్లాలో రామాలయంలో జరిగిన దాడి గాని ఇలా చెప్పుకుంటూ పోతే బ్రాహ్మణుల మీద ఈ ప్రభుత్వంలో ఎన్నో దాడులు జరిగాయని పేర్కొన్నారు. సమావేశంలో భీమవరం నియోజకవర్గ కన్వీనర్ వేలూరి శ్రీధర్ శర్మ, పెండ్యాల భవాని, హోతాహరి నారాయణ శర్మ, నరసాపురం కన్వీనర్ కొలచన శ్రీ పద్మ, తణుకు కన్వీనర్ చుండూరి శేష సాయి పాల్గొన్నారు.

అచ్చెన్నాయుడుకి టీడీపీ నేతల పరామర్శ

గణపవరం, ఏప్రిల్ 12: దివంగత నేత, కేంద్ర మాజీ మంత్రి కింజారపు యర్రన్నాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజారపు అచ్చెన్నాయుడు మాతృమూర్తి కళావతమ్మ ఇటీవల మృతి చెందిన నేపథ్యంలో శుక్రవారం పలువురు టీడీపీ నేతలు పరామర్శించారు. ఏలూరు జిల్లా టీడీపీ ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ళ సుబ్బారావు, గణపవరం మండలానికి చెందిన బీసీ నాయకులు నక్కా శ్రీనివాసరావు, వర్రా కన్నారావు, వెంకటరామారావు గురువారం రాత్రి శ్రీకాకుళం జిల్లా నిమ్మాడ గ్రామం వెళ్లి అచ్చెన్నాయుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా కళావతమ్మ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యం


భూపతిరాజు తిమ్మరాజు

ఆకివీడు రూరల్ ఏప్రిల్ 12 : అధిష్ఠానం నిర్ణయమే శిరోధార్యమని తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపతిరాజు తిమ్మరాజు అన్నారు. సిద్ధాపురంలో మాట్లాడుతూ ఏ సమయంలో ఏ నిర్ణయం తీసుకోవాలో పార్టీ అధిష్ఠానానికి తెలుసునని అన్నారు. పార్టీ నుంచే గుర్తింపు వస్తుందని, వ్యక్తులు ముఖ్యం కాదని, పార్టీ ముఖ్యమని ఆయన అన్నారు. రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించి ప్రజలకు సుఖ సంతోషాలందించేందుకు కూటమి ఆధ్వర్యంలో ముందుకు వెళుతున్నప్పుడు పార్టీ అధిష్ఠానం నిర్ణయాలకనుగుణంగా పనిచెయ్యాలని అన్నారు. ఉండి నియోజకవర్గంలో పార్టీ నిర్ణయం ప్రకారమే నడుచుకుంటానని తెలిపారు.

యువత ఓటర్లుగా నమోదు కావాలి



మాట్లాడుతున్న జిల్లా నోడల్ అధికారి జీసీహెచ్ ప్రభాకర్

భీమవరం ఎడ్యుకేషన్, ఏప్రిల్ 12 : 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులందరూ ఓటరుగా నమోదు కావాలని జిల్లా నోడల్ అధికారి జీసీహెచ్ ప్రభాకర్ కోరారు. శుక్రవారం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులతో ఓటు హక్కు, ఓటు నమోదుపై ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.ఆర్ కృష్ణచైతన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల నోడల్ అధికారి జీసీహెచ్ ప్రభాకర్ మాట్లాడుతూ ఈనెల ఏప్రిల్ 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతియువకులు ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటర్‌గా నమోదు అవ్వడమే కాకుండా ఓటు హక్కు కూడా వినియోగించుకోవాలని కోరారు. యువ ఓటర్లు ఆన్‌లైన్లో ఓటర్ హెల్ప్‌లైన్ డౌన్లోడ్ చేసుకుని ఆవిధంగా కూడా నమోదు అవ్వడానికి ఆస్కారం ఉందన్నారు. కళాశాల డైరెక్టర్ డా.ఎం జగపతిరాజు, ప్రిన్సిపాల్ డా.కెవి మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

దుంపగడప రైల్వేగేటు మూసివేత

ఆకివీడు, ఏప్రిల్ 12: ఆకివీడు రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న దుంపగడప వైపు వెళ్ళు రైల్వేగేటు ఈ నెల 14న ఉదయం 7 గంటల నుంచి 16న సాయంత్రం 7 గంటలు వరకూ మరమ్మతులు నిమిత్తం మూసివేస్తున్నట్టు కైకలూరు రైల్వే స్టేషన్‌కు చెందిన సీనియర్ సెక్షన్ ఇంజనీర్ శుక్రవారం తెలిపారు.

అమ్మవారికి చీరలతో అలంకారం



భీమవరం టౌన్, ఏప్రిల్ 12 : వసంత నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం పురస్కరించుకుని మెంటేవారి తోటలోని బాలా త్రిపుర సుందరీ అమ్మవారికి భక్తులు అందించిన చీరలతో ప్రత్యేకంగా అలంకారం చేశారు. ఉదయం గ్రంధి చిన తాతారావు దంపతులచే ఆలయ అర్చకుడు కొమ్ము శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభిషేకాలు, కుంకుమపూజలు చేశారు. తదుపరి చీరలతో అలంకారం చేశారు.

మావుళ్ళమ్మకు న్యాయమూర్తి సత్యాదేవి పూజలు

భీమవరం టౌన్, ఏప్రిల్ 12 : భీమవరం మూడవ అదనపు జిల్లా న్యాయమూర్తి పి.శ్రీసత్యాదేవి విశాఖపట్నం బదిలీ అయిన నేపథ్యంలో శుక్రవారం రాత్రి మావుళ్ళమ్మ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేయించుకున్నారు. కుటుంబసభ్యులతో ఆలయానికి వచ్చిన ఆమెకు దేవస్థానం ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.

పవన్‌ను విమర్శించే అర్హత ముద్రగడకు లేదు

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 12: తన స్వార్థ రాజకీయాల కోసం కాపులను ఉద్యమాల పేరుతో ఉసిగొల్పి నట్టేట ముంచిన ముద్రగడ్డ పద్మనాభానికి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ను విమర్శించే అర్హత లేదని కాపు నాయకులు అన్నారు. శుక్రవారం జనసేన కార్యాలయం లో వారు విలేకరులతో మాట్లాడుతూ ముద్రగడ కాపులకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. తాడేపల్లిగూడెంలో మంత్రి పదవి తీసుకున్న కొట్టు సత్యనారాయణ కాపులకు ఏం చేశారని ప్రశ్నించారు.

వలంటీర్లు రాజీనామా చేయవద్దు: వలవల

తాడేపల్లిగూడెం అర్బన్, ఏప్రిల్ 12: వైసీపీ నాయకుల మాటలు నమ్మి వలంటీర్లు రాజీనామా చేయద్దని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి అన్నారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్ల వేతనాలు రూ. 10 వేలు చేస్తామని అధినేత ప్రకటించారని, రాజీనామా చేయడం వల్ల నష్టపోతారని అన్నారు. కాపులకు ఎటువంటి లబ్ధి చేకూర్చని జగన్‌తో ముద్రగడ కలవడం సమంజసం కాదన్నారు.

మూడవ రోజుకు ఆమరణ దీక్షలు


ఆమరణ దీక్ష చేస్తున్న వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామరాజు

ఉండి, ఏప్రిల్ 12: టీడీపీ అధిష్ఠానం నుంచి రెండురోజుల్లో స్పష్టత రానున్నదని, దయతో ఆరోగ్యరీత్యా దీక్షలను విరమించాలని ఎమ్మెల్యే మంతెన రామరాజు ఆమరణ దీక్షాపరులకు సూచించారు. టీడీపీ కార్యాలయం వద్ద మూడురోజుల నుంచి జిల్లా టీడీపీ ప్రధాన కార్యదర్శి జుత్తుగ శ్రీనివాస్, నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు చెన్నం శెట్టి హరినాయుడు, నరసాపురం పార్లమెంటు తెలుగుయువత నాయకులు కాలా గణేష్ ఆమరణ నిరాహార దీక్షలు చేస్తున్నారు. దీక్ష చేస్తున్న వారిలో కాలాగణేష్ ఆరోగ్యం క్షీణించిందని తక్షణమే సెలైన్ బాటిల్స్ ఎక్కించాలని వైద్యులు సూచించారు. ఈసమాచారం ఎమ్మెల్యే రామరాజుకు చేరడంతో ఆయన హుటాహుటిన శిబిరం వద్దకు విచ్చేసి ఆమరణదీక్షాపరులను పరామర్శించి దీక్ష విరమించాలని సూచించారు. అయితే దీక్ష విరమించడానికి నిరాకరించారు. వైద్యులు సూచనలతో కాలా గణేష్‌ను 108లోకి ఎక్కించి భీమవరం ఆస్పత్రికి తరలించారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

కాళ్ళ, ఏప్రిల్ 12 : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్టు ద్వారా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని స్వతంత్ర అభ్యర్థి వేటుకూరి వెంకట శివరామరాజు అన్నారు. కాళ్ళకూరు గ్రామంలో మజ్జిగ చలివేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. ట్రస్టు అధినేత డాక్టర్ దాట్ల వెంకటరామరాజు, మాజీ ఎంపీపీ వేగేశ్న వెంకట గోపాలకృష్ణంరాజు, గాదిరాజు వెంకట సుబ్బరాజు, అడ్డాల నాగరాజు, నంబూరి దుర్గారాజు, ముదునూరి సూర్యనారాయణరాజు, మంతెన శ్రీవెంకటరాజు, వేగేశ్న రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

తణుకు: పట్టణంలోని కప్పల వెంకన్న సెంటర్లో మై ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. శుక్రవారం చలివేంద్రాన్ని న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు సూరంపూడి కామేష్ ప్రారంభించగా న్యాయవాది పొట్ల సురేష్, మై ఫ్రెండ్స్ సభ్యులు సుధీర్, క్రాంతి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలీసు కవాతు



తాడేపల్లిగూడెం రూరల్, ఏప్రిల్ 12: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రజలు సహకరించాలని పట్టణ సీఐ ఎ. సుబ్రహ్మణ్యం కోరారు. పట్టణం లో శుక్రవారం పోలీసు సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఎస్ఐ సుధాకరరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

భీమవరం టౌన్, ఏప్రిల్ 12 : భీమవరం నియోజకవర్గంలో గ్రామాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని నియోజకవర్గ జనసేన ఉమ్మడి అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. దిరుసుమర్రులో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. మంచి పరిపాలన అందిస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు కోళ్ళ నాగేశ్వరరావు, మెంటే పార్థసారథి, వేండ్ర శ్రీనివాస్, చనమల చంద్రశేఖర్, వబిలిశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

చింతలపాటి బాపిరాజు విద్యార్థుల ఉత్తీర్ణత

గణపవరం, ఏప్రిల్ 12: గణపవరం చింతలపాటి బాపిరాజు జూనియర్ కాలేజీ ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర పరీక్షల ఫలితాల్లో తమ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాస్ తెలిపారు. మొదటి సంవత్సరంలోని జనరల్ విద్యార్థులు 59 మందికి 20 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ఒకేషనల్ విద్యార్థులు 20మందికి 9 మంది ఉత్తీర్ణులయ్యారన్నారు. ద్వితీయ సంవత్సరం జనరల్‌లో 73మందికి 39మంది, ఒకేషనల్‌లో 20మందికి 11మంది ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థి కె.రవికుమార్ వెయ్యి మార్కులకు గానూ 941మార్కులు సాధించి కళాశాలలో మొదటి స్థానం సాధించాడు. విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది.

ఇంటర్ ఫలితాల్లో ఆదిత్య జయకేతనం


మల్లిపూడి రాకేష్, సూర్య అనిరుద్, పద్మసాయి శ్రీ హిత

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 12 : ఇంటర్ పరీక్షా ఫలితాల్లో ఆదిత్య జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు విద్యాసంస్థల డైరెక్టర్ ఎస్‌వీ రాఘవ రెడ్డి తెలిపారు. జూనియర్ విభాగంలో (ఎంఆర్‌సి) 470కి ఎం.వెంకట సూర్య అనిరుధ్ 465 మార్కులు, ఎం.సాయి సూర్య లోకేష్ 464 మార్కులు, కె.లక్ష్మీ దుర్గ 464 మార్కులు, ఎం.ముఖేష్ 463 మార్కులు, బైపీసీలో 440కి ఎం.రాకేష్ 431మార్కులు సాధించారని రాఘవ రెడ్డి తెలిపారు సీనియర్స్ విభాగంలో ఎంఆర్‌సీ విభాగంలో 1000 మార్కులకు సీహెచ్ పద్మసాయి శ్రీహిత 988 మార్కులు, పి.గోవర్ధన 987 మార్కులు, బైపీసీలో పి.నాగ స్పందన 972 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ రాఘవరెడ్డి, ఏవో జి వాసుబాబు అభినందనలు తెలిపారు.

మాంటిస్సోరీ విద్యార్థుల విజయం


పాలాడి స్వప్నిక, శ్రీ సాయి సాహితి

పాలకొల్లు అర్బన్, ఏప్రిల్ 12 : ఎల్ఆర్‌పేటలోని మాంటిస్సోరీ జూనియర్ కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో తమ కళాశాల పేరును ఇనుమడింప జేశారని డైరెక్టర్ కేవీ కృష్ణ వర్మ తెలిపారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో ఎంపీసీలో బండారు సాహితి 989 మార్కులతో రాష్ట్ర స్థాయి 4వ ర్యాంకు సాధించిందని, కె.మిత్రవింద దేవి 987 మార్కులుతో రాష్ట్ర స్థాయిలో 6వ ర్యాంకు, బైపీసీలో మార్లంపూడి స్వర్ణ పుష్ప 968 మార్కులు, కె.జాన్సీ దుర్గా కుమారి 953మార్కులు సాధించినట్టు తెలిపారు. సీఈసీలో షేక్ కరీమున్నీసా 950మార్కులు, వి.దుర్గా గాయత్రి 944 మార్కులతో కళాశాల టాపర్స్‌గా నిలిచారని తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఎంసీఈలె పాలాడి స్వప్నిక 470కి 463 మార్కులతో రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకు, కడలి శ్రీలక్ష్మీ 460మార్కులు, బైపీసీలో కొమ్ముల దివ్య వెంకట శ్రీజ 440కి 416, సీఈసీలో కడలి శ్రీలక్ష్మీ 460, కడలి అనుదీపిక 411 మార్కులు సాధించినట్టు డైరెక్టర్ కృష్ణవర్మ, ప్రిన్సిపాల్ ఎస్‌పిఎస్ ప్రకాశరావు తెలిపారు.

కార్తికేయ, విద్యావికాస్ విద్యార్థుల ప్రతిభ

ఆకివీడు, మే 6: ఇంటర్ ఫలితాల్లో కార్తికేయ జూనియర్ కళాశాల, విద్యా వికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కార్తికేయ జూనియర్ కళాశాలకు చెందిన ఫస్టియర్, సెకండియర్ ఎంపీసీలో పిండి శివాని, మొల్లేటి లోకేశ్ నాగసాయి కుమార్, బైపీసీలో మరపట్ల బ్యూలా ఎవంజలిన్, పొగిరి జోత్స్నలు మండల ఫస్ట్‌లు సాధించారని అధినేత మీసాల రవికుమార్ తెలిపారు. విద్యావికాస్ జూనియర్ కళాశాలలో ఫస్టియర్ సీఈసీలో ఎండీ అఫ్రాన్ అజ్మి, సెకండియర్ సీఈసీలో జయమంగళ సంధ్యలు మండల ఫస్ట్ సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ చొప్పెర్ల బలరామ్ తె లిపారు.

ప్రగతి విద్యార్థుల జయకేతనం


రెడ్డి హేమశ్రీ, జి. వెంకటలక్ష్మి

తణుకు, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాలలో తణుకు ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు కళాశాల డైరెక్టర్ ఎం.ఎస్.ఆర్. ఆంజనేయులు (రాజా) తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంపీసీ (ఇంగ్లీషు మీడియం)లో రెడ్డి హేమశ్రీ 470 మార్కులకు 464, గుడివాడ వెంకట నాగలక్ష్మి 463, బి.దేవి 463 మార్కులు సాధించారు. 462 మార్కులు పైన 8 మంది సాధించారని చెప్పారు. బైపీసీ (ఇంగ్లీషు మీడియం)లో ఆట్రగాడ కళ్యాణి 440కు 430, మల్లిపూడి శ్రీలక్ష్మి 429, బండి విజయశ్రీ 425, ఎంపీసీలో ఎస్. వినయ్‌కుమార్ గుప్త 500కు 472, గొలుగూరి సూర్యతేజ రెడ్డి 463 మార్కులు సాధించారన్నారు. సీనియర్ ఇంటర్‌లో బైపీసీ (ఇంగ్లీషు మీడియం)లో బూర్లు దివ్య 1000కు 981, ఉప్పల పూజిత 977, ఎస్.స్వరుప రాణి 977, నొడగల హరిణి 977, ఎంఈసీలో పద్మావతి దేవి 1000కు 969, బి.బాపి యశ్వంతి 968 మార్కులు సాధించారని చెప్పారు. జూనియర్ ఇంటర్‌లో 470కు 450కు పైగా 83 మంది, బైపీసీలో 440కు 400పైగా 21 మంది సాధించారని వివరించారు. సీనియర్ ఇంటర్‌లో 1000కు 900 పైగా 134 మంది సాధించారన్నారు.

ఎస్‌కేఎస్డీ ఉత్తమ ఫలితాలు

తణుకు, ఏప్రిల్ 12: ఎస్‌కేఎస్‌డీ జూనియర్ కళాశాల విద్యార్థులు జిల్లాలోనే ఉత్తమ ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.హెచ్.హిమబిందు తెలిపారు. ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సులలో బి.దీప్తిరాణి 470మార్కులకు 452, సీహెచ్ అనూష 440కు 415, బైపీసీ (ఇంగ్లీష్ మీడియం)లో బి.అక్షయ సుధ 500కు 458, యస్.సాయి భార్గవి 458, సీఈసీలో షాబారాణి 436, మార్కులు సాధించారన్నారు. ఒకేషనల్ కోర్సులలో పి.చిన్ని 500కు 485, ఎ.భావన రేఖ 471, పి.నీలిమ 478, ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సులలో శ్రావణి 1000కు 981, పి.భార్గవి 955, బైపీసీలో పూర్ణిమ 892, అభినయశ్రీ 901, సుహాసిని 893, హరిత 908 మార్కులు, ఒకేషనల్ కోర్సులలో రేఖాదేవి 1000కు 972, దర్శిని 971, సౌమ్య 921 మార్కులు సాధించినట్లు చెప్పారు. 510 మంది విద్యార్థులు 'ఏ' గ్రేడ్ సాధించారన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి అభినందించారు.

డీఆర్‌జీలో 67 శాతం ఉత్తీర్ణత

పెంటపాడు, ఏప్రిల్ 12: ఇంటర్ ఫలితాల్లో పెంటపాడు డీఆర్ గోయెంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనపర్చారని ప్రిన్సిపాల్ ఎంవీఆర్ దేవరాజు తెలిపారు. ఇంటర్ ఫస్టియర్‌లో 40 శాతం, సెకండ్ ఇయర్‌లో 67 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు. సెకండ్ ఇయర్ సీఈసీ విద్యార్థిని కుసుమాంజలి 957 మార్కులతో జిల్లాలో ప్రభుత్వ కళాశాల్లో మొదటి స్థానంలో నిలిచిందన్నారు. హెచ్‌ఈసీకి చెందిన ఎం.సత్యసాయి 935 మార్కులు, బైపీసీలో తేజా 945, అంజలి 940 మార్కులు సాధించారన్నారు.

రేపు రక్తదాన శిబిరం

పెనుగొండ, ఏప్రిల్ 12: అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆదివారం సిద్ధాంతం లంకపేట చర్చి వద్ద రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు కేవీపీఎస్ జిల్లా నాయకులు కప్పల రత్నరాజు తెలిపారు.